క్లుప్తంగా

6 నుంచి 'గడప గడపకు'

మునగపాక : మునగపాకలో ఈ నెల 6 నుంచి జరగనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో సోమవారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు రాము, గణేష్, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ద్వారా మేలు



మాట్లాడుతున్న బీసీటీ శాస్త్రవేత్త శ్రీహరి

మునగపాక : భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని బీసీటీ శాస్త్రవేత్త శ్రీహరి కోరారు. అరబుపాలెం గ్రామంలో సోమవారం బీసీటీ ఆధ్వర్యంలో భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సారవంతంగా ఉన్ననాడే ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. పశువుల గెత్తం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు వంటి ఎరువులను వినియోగించాలన్నారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త పీపీ నాయుడు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌కు యల్లపు సేవలు మరువలేనివి



యల్లపు సూర్యనారాయణకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మునగపాక : డీసీఎంఎస్ అభివృద్ధికి దివంగత యల్లపు సూర్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ చిందాడ దేవి అన్నారు. నాగులాపల్లిలో సూర్యనారాయణ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడారు. సూర్యనారాయణ పలు పదవులు అలంకరించి వాటికి వన్నె తెచ్చారని, నాగులాపల్లి గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహ సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పాలసంఘ మాజీ అధ్యక్షుడు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

8న దేవతమ్మ ఉత్సవం

కశింకోట : కశింకోటలోని గవరపేటలో రెండేళ్లకోమారు నిర్వహించే దేవతమ్మ ఉత్సవం ఈ నెల 8న జరపాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఈ నెల 4న రాత్రి అమ్మవారి పుట్టుక ఉత్సవం జరుగనుందన్నారు. శారదానది అవతల ఉన్న అమ్మ వారి పుట్ట వద్ద కొలిచి అమ్మ వారి ప్రతి రూపాన్ని తీసుకువచ్చి గవరపేటలోని ఆలయంలో నిలుపుతామన్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి నాలుగో రోజు ఉత్సవం జరుపుతామని తెలిపారు. ఉత్సవం రోజున యువకులతో సిద్ధుల వేషం, పంచ రంగుల ముగ్గు వేసి సంప్రదాయంగా తొక్కడం, అమ్మవారి నిమజ్జనోత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. స్థానికులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 'వేగి' ఇంటి పేరు కలిగిన కుటుంబీకులు వచ్చి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు.

4న వరాహలక్ష్మీ నృసింహస్వామి జయంతి

అనకాపల్లి టౌన్ : గవరపాలెం దిబ్బవీధి వరహా లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 4న స్వామివారి జయంతి పురస్కరించుకొని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పేర్కొన్నారు. 1008 తులసీ దళాలతో శ్రీమన్నారాయణపూజ ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని శివాలయంలో సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. పేదలకు అన్న సమారాధ చేశారు.

ఊరటనిచ్చిన వర్షం



మునగపాకలో కురుస్తున్న వర్షం



అప్పన్నపాలెంలో రాంబిల్లి రోడ్డుపై వర్షం నీరు

మునగపాక : మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి వర్షం కురవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా ఎండ వేడిమితో సతమతమైన ప్రజలకు ఈ వర్షం ఊరట కలిగించింది. తెల్లవారు 3 గంటల నుంచి చిరుజల్లులు కురవడంతో అటు రైతులు, ఇటు ప్రజలు ఉపశమనం పొందారు. పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఈ వర్షం పంట పొలాలకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

రాంబిల్లి: వాతావరణం ఒక్కసారిగా మారింది. ఎండలతో అట్టుడుకుపోతున్న తరుణంలో సోమవారం వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. పలు రోడ్లపై వర్షం నీరు నిల్వ చేరింది. వర్షం తెరిపివ్వకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరి నూర్పిడి పనుల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం తడిసిపోకుండా పరదాలతో కప్పారు.

కోటవురట్ల: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో కుండపోతగా వర్షం కురిసింది. సోమవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. గత 15 రోజులుగా తీవ్ర ఎండలు, వడగాడ్పులతో అల్లాడిన మండల ప్రజలకు ప్రస్తుత వాతావరణం ఆహ్లాదాన్ని ఇస్తోంది.

యలమంచిలిలో భారీ వర్షం

యలమంచిలి: యలమంచిలి ప్రాంతంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. రోజువారీ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారం చేసేవారు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. అయితే ఈ వర్షం వేసవి దుక్కులకు ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారులు చెప్పారు. గ్రామాల్లో మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు జనం ఇబ్బందులు పడ్డారు.



యలమంచిలి పట్టణంలో కురుస్తున్న వర్షం



సుందర కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఎస్.రాయవరం : మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండు వేసవిలో ఈ వర్షం ఉపశమనం కల్పించింది. మండలంలో 4 సెంటీమీటర్లు వర్షం కురిసినట్టు తహసీల్దార్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఆగకుండా కురిసిన వర్షంతో కొరుప్రోలు సుందరకాలనీ, పి.ధర్మవరం వివేకానంద కాలనీ, పెదగుమ్ములూరు రాజుల కాలనీ తదితర ప్రాంతాల్లో వీధి రోడ్లపై నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు.

జోరు వానలోనూ గడప గడపకు



పూడిమడకలో జోరువానలోనూ గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): జోరు వానలోనూ పూడిమడక –1 సచివాలయం పరిధిలోని జాలరివానిపాలెం, పెద్దూరు గ్రామాల్లో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యల గురించి ఆరా తీశారు. నవరత్నాల పథకాల గురించి వివరించారు.పరిశ్రమల ప్యాకేజీల అంశంపై జనసేన పార్టీ నాయకులు కొద్దిగా హడావిడి సృష్టించడంతో కొద్దిపాటి గందరగోళం ఏర్పడింది. జనసేన పార్టీ కార్యకర్తల వినతులను ఎమ్మెల్యే కన్నబాబురాజు సానుకూలంగా విని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తల నినాదాలతో వారికి సమాధానం ఇచ్చి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం యథావిధిగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్‌రావు, సర్పంచ్ చేపల సుహాసిని, చేపల వెంకటరమణ, చేపల శ్రీరాములు, ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి జగన్, మద్దెల చిన్నారావు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో గడప గడపకు స్పందన

అచ్యుతాపురం(అనకాపల్లి): పునరావాస కాలనీ దిబ్బపాలెం సచివాలయం పరిధిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని దిబ్బపాలెం సర్పంచ్ దిగుమర్తి శాంతి కుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం సాక్షితో మాట్లాడుతూ 26 శివారు గ్రామాల పరిధిలో 1500 గృహాలను సందర్శించామని, స్థానికుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఎమ్మెల్యే కన్నబాబురాజు పనితీరు, సీఎం జగన్ పరిపాలనకు ప్రజలంతా ఆమోదయోగ్యంతో ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు సందర్భంగా కోలాటమాడుతున్న మహిళలు

నక్కపల్లి : మండలంలో వేంపాడు గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వెంకన్న వార్షిక కల్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కోలాట బృందాలతో కోలాట కార్యక్రమాలు జరిగాయి. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన జరిపారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, గునిపూడి సర్పంచ్ అయినంపూడి చినపేర్రాజు, స్థానిక నాయకులు సురేష్‌రాజు, బాబ్జిరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా శివకేశవుల కల్యాణోత్సవం

రావికమతం : ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవ స్వామి వార్ల ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి వారికి, రాజరాజేశ్వరి సమేత శ్రీరాజలింగేశ్వర స్వామి వారికి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంతోపాటు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అమ్మవార్లను, స్వామివార్లను ఒకే వేదికపై అధిష్ఠింపజేసి పాంచరాత్ర, శైవాగమోక్తంగా కార్యక్రమాన్ని గుమ్ముడు దొరబాబు, పెనుగొండ నానాజీ, పెనుగొండ నూకేశరావు దంపతుల చేతుల మీదుగా దేవదాయశాఖ నిర్వహించింది.



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

ఈ నెల 3న సదోత్సవం నిర్వహించ నున్నట్టు ఆలయ ప్రధానార్చకులు భాస్కర్, సాయి తెలిపారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం

మాకవరపాలెం : వేసవి శిక్షణతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం నుంచి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు ఆటలకు పరిమితం కాకుండా, వివిధ అంశాల్లో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కరాటే, డ్యాన్స్, చెస్, నాటికల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు, వైఎస్సార్‌సీపీ నేత గొంతిన హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కె.కోటపాడు : ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులుంటాయన్నారు. విద్యార్థులు ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజును మే 3లోగా చెల్లించాలని తెలిపారు.

వైభవంగా ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ వేడుక జరుపుతున్న అర్చకులు

కోటవురట్ల : స్థానిక ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మయ్య శర్మ, గణేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కల్యాణానికి ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన హోమం, ధ్వజపటం కట్టుట, బలిహరణ నిర్వహించారు. కల్యాణ వేడుక అనంతరం అష్టోత్తర పూజ, నీరాజనం, మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ జరిపారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు.

ప్రశాంతంగా జాతర జరుపుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

ఎస్.రాయవరం: గ్రామాల్లో జాతర ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నక్కపల్లి సీఐ నారాయణరావు అన్నారు. రేవు పోలవరం, కొత్తరేవు పోలవరం గ్రామాల్లో ఈ నెల 9న జరగనున్న బంగారమ్మతల్లి జాతరపై ఇరు గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. ప్రతి ఏడాది బంగారమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే మత్స్యకార గ్రామాలతో పాటు సమీపం గ్రామాలు కొత్త పోలవరం, బంగారమ్మ పాలెం, పెదఉప్పలం తదితర గ్రామాలకి చెందిన వారు పెద్ద ఎత్తున జాతరలో పాల్గొంటారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ శ్యామ్‌కుమార్, సర్పంచ్‌లు లోవరాజు, అనూరాధ, వైస్ ఎంపీపీ అప్పన్న, ఎస్ఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



నక్కపల్లిలో కేక్ కట్ చేస్తున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నక్కపల్లిలో నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద కాపు కార్పొరేషన్ డైరక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ కేక్ కట్ చేసారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. సుబ్బారెడ్డికి సంపూర్ణ ఆరోగ్యాలు ప్రసాదించాలని రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీసం రాజు, పార్టీ నాయకులు సత్తిబాబు, ముద్దా శ్రీను, దేవవరపు వెంకట సత్తియ్య, దేశెట్టి నాగు పాల్గొన్నారు.

➡ సారిపల్లిపాలెంలో పార్టీ బీసీసెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు ఎస్.గోవిందు, వై.తాతారావు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, సర్పంచ్‌లు ముసలయ్య, రమణ , నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వివేకా హత్యపై తప్పుడు ప్రచారం మానుకోవాలి



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాయకరావుపేట : తాను ఎమ్మెల్యే అయిన వెంటనే భర్తపైనే పోలీసు కేసు పెట్టి కొట్టించి జైలుకు పంపించిన ఘనత టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితదని పాయకరావుపేటకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు లంకసూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు దనిసెట్టి బాబూరావు, పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా తదితరులు విలేకరులతో మాట్లాడుతూ వై.ఎస్.వివేకా హత్యకేసుపై అనిత తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. పాయకరావుపేటలో కాపు వర్గానికి చెందిన యువకుడిని చెప్పుతో కొట్టిన చరిత్ర ఆమెదని, ఎన్‌టీ రామారావును వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కొని మానసికంగా వేధించి చంపేసిన చంద్రబాబు ఆమెకు ఆదర్శమని అన్నారు. పదవుల కోసం ఎంతటి దారుణాలకైనా ఒడిగట్టే వీరికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హతగాని, వివేకా హత్యగురించి మాట్లాడే నైతిక హక్కు గాని లేదన్నారు. అనితను సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే పాయకరావుపేట నుంచి తరిమేశారని, అయినా సిగ్గురాలేదన్నారు. మండలంలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేసి పలు అభివృద్ధి పనులు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైస్ ఎంపీపీ దనిసెట్టి బుజ్జి, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ పాల్గొన్నారు. పాయకరావుపేటలో ఆదివారం టీడీపీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదని, వారు గతంలో టీడీపీ వారేనని నాయకులు స్పష్టం చేశారు.

కార్మికులు సంఘటితం కావాలి



యలమంచిలి పట్టణంలో మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు



అడ్డురోడ్డు కూడలిలో జెండా వందనం చేస్తున్న కార్మికులు



అచ్యుతాపురం జంక్షన్‌లో మే డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



తోటాడలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిసెట్టి ఏసుదాసు ఆధ్వర్యంలో మేడే జెండాను కార్మికులతో కలసి ఆవిష్కరించారు. 137వ మేడే వేడుకల్లో భాగంగా ఏసుదాసు మాట్లాడుతూ కార్మికుల హక్కులు పోరాటాల ద్వారా సాధించుకోవాలని, ఉద్యోగ, కార్మిక ఇతర అట్టడుగు వర్గాలు సంఘటితం కావాలని అన్నారు. అనంతరం ఆటో యూనియన్ వద్ద తాపీ మేస్త్రీల సంఘం, మండలంలో పులపర్తి గ్రామాల్లో మేడే కార్మిక సంఘాల నాయకులు పతాకావిష్కరణలు చేశారు. కార్యక్రమంలో అల్లిమళ్ల నాగు, శంకర్రావు, అప్పలనాయుడు, నూకరాజు, వెంకటరమణ, మహేష్, నగిరెడ్డి శివ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: కార్మికులు తమ హక్కులు తెలుసుకుని పని చేయాలని, వాటి సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. మండల వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డు కూడలిలో కార్మిక సంఘ నాయకులతో కలిసి ఎర్రజెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు హక్కులను అమలు పరచేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని, నిత్యం శ్రమించే కార్మికులు అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్మిక సంఘ నాయకులు బాబి, బాబ్జి, నారాయణరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో మేడే వేడుకలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో మేడే వేడుకలు సోమవారం కార్మికులు నిర్వహించారు.తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్లలో పెయింటర్లు, అచ్యుతాపురంలో భవన నిర్మాణ కార్మికులు, ముఠా కార్మికులు, అభిజిత్ మైథాన్, ఏసియన్ పెయింట్స్, లారస్‌ల వద్ద ఫార్మా కార్మికులు, రుసూల్ కర్మాగారాల కార్మికుల మే డే వేడుకల్లో పాల్గొని ఎర్ర పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

మునగపాక : మండల వ్యాప్తంగా సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మునగపాక, రాజుపేట, తోటాడ తదితర ప్రాంతాల్లో మే డేను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులతో వెట్టి చాకిరీ తగ్గించి పనికి తగ్గ వేతనాలు అందించేలా చూడాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉన్ననాడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, రాము అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఆడారి రామలక్ష్మి, అరుణ, అంజలి, తులసి, ఆశ యూనియన్ నాయకులు దాడి ఉమ, జోగినాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలుచోట్ల పతాకావిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు. కట్టుబోలులో డీవీ సన్నయ్య ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు.

దేవాలయ భూముల కౌలుకు వేలం నేడు

నాతవరం : మండల కేంద్రంలోని శ్రీగంగాదేవి, శ్రీనూకాలమ్మ దేవస్థానం భూముల కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు యలమంచిలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖకు చెందిన వ్యవసాయ పంట భూముల్లో సాగు కోసం కౌలుకిచ్చేందుకు నాతవరం రామాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట జరగనుందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్ద లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో జరిగే వేలం పాటకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు దేవదాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గ్రామ దేవతల పండగ నేడు

కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారు, ఎ.భీమవరంలో మరిడిమాంబ అమ్మవారి పెద్ద పండగలను మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరేళ్ల తర్వాత ఆర్లి పైడితల్లమ్మ పండగ, ఐదేళ్ల తర్వాత ఎ.భీమవరం మరిడిమాంబ పండగ రావడంతో రెండు గ్రామాలూ విద్యుత్ దీపాలంకరణలతో పండగ శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయం మేరకు పండగ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు.

అకాల వర్షాలతో అపరాలకు మేలు

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం 6 గంటలకే ఆకాశం మేఘావృతమై, వాతవరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. గత నెలలో రైతులు రోలుగుంట. వైబీ పట్నం, ఎం.కె.పట్నం, శరబవరం తదితర గ్రామాలల్లో బొబ్బరి, పెసర, మినుము, నువ్వు తదితర అపరాల పంటలు సాగు చేపట్టారు. ఎండలకు మొక్కలు వడిలిపోతున్న తరుణంలో సోమవారం కురిసిన అకాల వర్షానికి ఆ పంటలకు జీవం పోసినట్టయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కరాటే, కిక్ బాక్సింగ్ ఉచిత శిక్షణ తరగతులు

అనకాపల్లిటౌన్ : జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థాని ఉడ్‌పేట అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఉచిత కరాటే కిక్ బాక్సింగ్ క్రీడలపై శిక్షణ ఇస్తున్నామని కోచ్ ఉమా వెంకట మహేశ్వరరావు సోమవారం పేర్కొన్నారు. ఈ క్రీడలు జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు బాల బాలికలు, యువకులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత జిల్లా క్రీడలశాఖాధికారి ఎస్.సూర్యారావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9704471628 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.